సాక్షి
నంద్యాల
మంగళవారం, 5, సెప్టెంబర్, 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం విజయవాడకు చెందిన వై.శివరామకృష్ణ రూ.1,00,120 అందజేశారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం వెండిరథంపై ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



గురుభ్యోనమః

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంగళవారం ఉపాధ్యాయదినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నారు. ..8లో

న్యూస్‌రీల్

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



కంపార్ట్‌మెంట్‌లో వేచిఉన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. ఆదివారం సెలవు దినంతో పాటు శ్రావణ సోమవారం కావడంతో భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనార్థం ఆలయ క్యూల వద్ద బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ క్యూలలో దర్శనాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు పలు చర్యలు చేపట్టారు. క్యూలలో వేచి ఉన్న భక్తులకు మజ్జిగ, సాంబారన్నం, పెరుగన్నం, చిత్రాన్నం, తాగునీరు, బిస్కెట్లు, అందించారు. శ్రావణ మాసం వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన సంఖ్యలో లడ్డూప్రసాదాలు సిద్ధం చేసి, మొత్తం 7 కౌంటర్ల ద్వారా విక్రయించారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కళకళలాడాయి.

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.5 లక్షల విరాళం



ఆలయ ఈఓకు నగదు అందజేస్తున్న కర్ణాటక భక్తులు

బనగానపల్లెరూరల్: నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కర్ణాటక రాష్ట్రం కొల్లార్‌కు చెందిన జయమ్మ చౌడప్ప శ్రీ చౌడేశ్వరి ట్రాన్స్‌పోర్ట్ అండ్ చాముండేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ అధినేతలు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆలయ ఈఓ రామానుజన్, మాజీ ఆలయ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. అనంతరం దాత కుటుంబీకులను పూలమాల, దుశ్శాలువా వేసి సత్కరించి, అమ్మవారి ప్రసాదం అందజేశారు.

'పది' ఫెయిల్ విద్యార్థులు 15లోపు ఫీజు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): గత విద్యా సంవత్సరంలో పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం (2024 –మార్చి)లో జరగనున్న పరీక్షలకు హాజరయ్యేందుకు ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 21 నుంచి 25వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుంతో 26 నుంచి 30వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రుసుం అవసరమయితే రూ.80 చెల్లించాల్సి ఉందన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ పేర్కొన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం

బొమ్మలసత్రం: పోలీసు స్పందనలో వచ్చిన ఫిర్యాదులను విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 85 ఫిర్యాదులు అందాయి. వాటి వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు రెఫర్ చేసి తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. దూరప్రాంత ప్రజలు వ్యయప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రాకుండా 9154987020కు నేరుగా ఫోన్ చేయడం, ఫిర్యాదులను వాట్సప్ ద్వారా అందజేయవచ్చని సూచించారు. ఈ రకంగా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఎస్‌ఐ హరినాథ్‌రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



దొర్నిపాడు మండలంలో ప్రాణం పోసుకున్న పత్తి



కోవెలకుంట్ల మండలం అమడాల సమీపంలో చిక్కుడు పంటలో చేరిన వర్షపునీరు



సంజామల మండలం ముక్కమల్లలో కళకళలాడుతున్న ముత్యాలవాగు చెరువు



ఆత్మకూరు మండలంలోని పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



పాణ్యం మండలం కౌలూరు సమీపంలో..



ఆళ్లగడ్డ సమీపంలో పొలంలో సేద్యం చేస్తున్న రైతులు

కోలుకున్న ఖరీఫ్

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

- నగటున 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం
- పత్తితో పాటు వేరుశనగ పైర్లకు జీవం
- జోరుగా పొగాకు, మిరప, ఉల్లి, వాము సాగు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కృష్ణగిరి సమీపంలో వర్షానికి కళకళలాడుతున్న ఆముదం పైరు

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఇక ఖరీఫ్ పంటలు చేతికందడం కష్టమనుకుంటున్న తరుణంలో ఈ వర్షాలు ఊపిరి పోస్తున్నాయి. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ పంటలతో పాటు ముందస్తు రబీకి మార్గం సుగమమైంది. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లతో పాటు ఫాంపాండ్స్ జలకళను సంతరించుకుంటున్నాయి. ఈనెల 15 నుంచి రబీ సీజన్‌కు సంబంధించి ముందస్తు శనగతో పాటు వివిధ పంటలు సాగుచేసే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో సగటున 39.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో అత్యధికంగా తుగ్గలిలో 62.4 మి.మీ.. అత్యల్పంగా గోనెగండ్లలో 5.4 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా మొదటి నాలుగు రోజుల్లోనే 51.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా నంద్యాల జిల్లాలో ఒక్క చాగలమర్రి మినహా అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా డోన్‌లో 63.4,, అత్యల్పంగా ఆళ్లగడ్డలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 134 మి.మీ ఉండగా నాలుగు రోజుల్లోనే 75.6 మి.మీ వర్షం కురవడం విశేషం.

ఖరీఫ్ పంటలు గట్టెక్కినట్లే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పంటలు కోలుకుంటున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 3.02 లక్షల హెక్టార్లలో పంటలు సాగవగా.. ఇందులో పత్తి 1.80 లక్షల హెక్టార్లలో ఉంది. పత్తి ఎక్కువగా నల్లరేగడి నేలల్లో సాగు చేస్తుండటంతో నిన్న మొన్నటి వరకు వర్షాభావం ఉన్నా ఎక్కడా ఎండిన దాఖలాల్లేవు. తాజా వర్షాల వల్ల పూర్తిగా కోలుకునే అవకాశం ఏర్పడింది. మొక్కజొన్న అక్కడక్కడ వాడు పట్టినప్పటికీ ఈ వర్షాలకు పచ్చగా కనిపిస్తున్నాయి. వేరుశనగ కూడా చాల వరకు కోలుకుంటోంది. ఇదిలాఉంటే వర్షాలు పడుతుండటంతో పొగాకు, మిరప, ఉల్లి, వాము సాగు పెరుగుతోంది.

కర్నూలు జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
తుగ్గలి	62.4
ఆదోని	59.4
గూడూరు	51.2
ఆస్పరి	46.4
కోడుమూరు	44.8
ఓర్వకల్	44.2
మద్దికెర	43.4
హాలహర్వి	42.6
క్రిష్ణగిరి	36.2
కౌతాళం	36.0
కర్నూలు అర్బన్	35.8
కల్లూరు	35.2
కర్నూలు రూరల్	34.2
పత్తికొండ	31.2
ఆలూరు	30.4

నంద్యాల జిల్లాలో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

డోన్	63.4
ఆత్మకూరు	63.4
కొత్తపల్లి	50.8
నంద్యాల	30.6
కొలిమిగుండ్ల	29.8
శిరువెళ్ల	27.8
మిడుతూరు	24.2
బండిఆత్మకూరు	23.6
ప్యాపిలి	22.4



తుగ్గలి సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న కాలువ

శోభాయమానం.. సమర్పణోత్సవం

- రాఘవేంద్ర స్వామి ఆరాధన సప్తరాత్రోత్సవాలు పరి సమాప్తం
- అనుమంత్రాలయంలో వైభవంగా రథోత్సవం

మంత్రాలయం: పరమ గురువు శ్రీ రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో ఆఖరి రోజు సర్వసమర్పణోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం రాఘవేంద్రుల మూలబృందవనానికి రోజు వారి పూజలు చేపట్టారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల, దివిటీ సేవ చేశారు. చెక్క పథంపై సింహ, గజ, అశ్వ, బంగారు పల్లకీల్లో రాఘవేంద్రులను ఊరేగించారు. యోగీంద్ర కళా మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



రథయాత్రకు హారతులిస్తున్న పీఠాధిపతి

అనుమంత్రాలయలో

ఏడోరోజు అనుమంత్రాలయం తుంగభద్ర గ్రామంలో వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పీఠాధిపతి గ్రామ మృత్తిక బృందావన క్షేత్రంలో ఉత్సవాలు చేపట్టారు. మృత్తిక బృందావనానికి విశిష్ట పూజలు చేసి రథయాత్రకు అంకురార్పణ పలికారు. మహిళల కోలాటాలు, భజనలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వేడుక రమణీయంగా సాగింది.



అనుమంత్రాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి బృందావనం



శ్రీ మఠంలో సీఎస్ జవహర్‌రెడ్డి

శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం మంత్రాలయం చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, ఆ తర్వాత శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈయనకు పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. అనంతరం మఠం ఆధ్వర్యంలో జరిగిన, జరుగుతున్న పనులను జవహర్‌రెడ్డికి పీఠాధిపతి వివరించారు.

జవహర్‌రెడ్డికి శ్రీ రాఘవేంద్రస్వామి మెమొంటో అందజేస్తున్న పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు

తొలగించిన ఓట్ల పునఃపరిశీలన పూర్తి చేయండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

నంద్యాల: ఓటర్ల జాబితాలో 2022 జనవరి 6 - 2023 మార్చి 31 వరకు తొలగించిన ఓట్లకు సంబంధించి పునఃపరిశీలన ఈనెల 7వ తేదీ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జేసీలతో ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల అంశాలపై ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఆర్‌ఓ పుల్లయ్య, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేర్పులు మార్పులు, కొత్తగా నమోదైన ఓటర్లు తదితర వివరాలన్నింటినీ ఈనెల 25 లోపు పూర్తి చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

- ముతవల్లులకు హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం అంజద్ బాషా

కర్నూలు (సెంట్రల్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం అంజద్ బాషా హామీ ఇచ్చారు. సోమవారం రాత్రి కర్నూలులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ముతవల్లులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఆయనతో పాటు ఎమ్మెల్సీలు రుహుల్లా, ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్ హాజరయ్యారు. ముందుగా ముతవల్లులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నుంచి వినతుల రూపంలో అంజద్ బాషా స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలంటే ముందుగా బోర్డు పాలకమండలి ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. త్వరలోనే నూతన పాలకమండలి ఏర్పాటయ్యే అవకాశముందని చెప్పారు. వక్ఫ్ ఆస్తులను ఎవరు ఆక్రమించుకున్నా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వక్ఫ్ ఆస్తికి కంచె వేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. కర్నూలు వచ్చిన అంజద్‌బాషాకు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, ఇతర ముస్లిం నేతలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో షేక్ ఖాజా బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలో రెండోసారి కొత్త పింఛన్లు

- ఉమ్మడి జిల్లాకు మరో 12,218 మందికి పింఛను కానుక

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద మరోసారి భారీ ఎత్తున పింఛన్లు మంజూరు అయ్యాయి. ఇటీవలనే ఉమ్మడి జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు కేటాయించారు. పాత వాటితో పాటు కొత్త పింఛన్లకు కూడా నగదు పంపిణీ చివరిదశకు చేరింది. తాజాగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు 12,218 కొత్త పింఛన్లు మంజూరు కావడం విశేషం. తాజాగా మంజూరు చేసిన కొత్త పింఛన్లు కూడా మంగళవారమే పంపిణీ చేసే అవకాశం ఉంది. రికార్డు స్థాయిలో ఏకంగా 23,303 పింఛన్లు మంజూరు కావడంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా.. ఎలాంటి సిఫార్సులు లేకుండా మంజూరైనట్లు స్పష్టమవుతోంది. మొత్తంగా కొత్త పింఛన్లకు ప్రభుత్వం రూ.6,53,90,000 పంపిణీ చేస్తోంది. ఏడాదిలో రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేస్తుండటం పట్ల అవ్వతాతలు, వికలాంగులు ఇతర అన్ని వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది. టీడీపీ హయాంలో పింఛనుదారుల్లో ఎవరైన మరణించినప్పుడే ఇతరులకు అవకాశం కల్పించేవాళ్లు. ఇప్పుడు అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిలో రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసి కొత్త చరిత్రకు నాంది పలికినట్లయింది.

ఆసుపత్రుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాలటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆర్. మాధవి తెలిపారు. మొత్తం 33 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. వీటిలో 03 థియేటర్ అసిస్టెంట్, 01 పోస్ట్‌మార్టం అసిస్టెంట్, 24 జనరల్ డ్యూటీ అసిస్టెంట్, 01 ప్లంబర్, 03 ఆఫీస్ సబార్డినేట్, 01 ఆడియో మెట్రిక్ టెక్నీషియన్ పోస్టులను ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో సూచించిన ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ లోపు కర్నూలు లోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలhttps://kurnool.ap.gov.in,https://nandyal.gov.in వైబ్ సైట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు.



నాన్నతో నడిచిన ధైర్యం!

వేలు పట్టి ప్రపంచాన్ని చూపిన తండ్రి.. కుమారుడు నడక నేర్చుకుని వేగంగా పరుగెడుతుంటే సంతోషించిన నాన్న.. మంచి నడతతో సమాజంలో పేరు తెచ్చుకుంటున్న తనయుడిని చూసి మురిసిన కన్న పేగు..ఒక్కసారిగా కలత చెందింది.. రోడ్డు ప్రమాదంలో గాయపడి చెట్టంత కొడుకు విల్లవిల్లాడుతుంటే తండ్రి హృదయం తల్లడిల్లింది..కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కుమారుడికి చికిత్స చేయించిన అనంతరం ఆ తండ్రికి సాంత్వన లభించింది. గాయాలకు కట్లు కట్టిన అనంతరం నడవలేని కుమారుడిని భుజాలకు ఎత్తుకుని ధైర్యంగా వెళ్తున్న దృశ్యం కన్న ప్రేమకు నిదర్శనంగా నిలిచింది.

– కర్నూలు(హాస్పిటల్)

ఉప సర్పంచ్‌ల ఎంపికలో వైఎస్సార్‌సీపీ హవా



నాగటూరు ఉపసర్పంచ్ ఉశేనయ్యకు ధ్రువ పత్రం అందిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): సోమవారం జిల్లాలోని అయా గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపసర్పంచ్‌ల ఎంపికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల హవా కొనసాగింది. జూపాడుబంగ్లా మండలం జూపాడుబంగ్లా గ్రామం, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె గ్రామం, కొత్తపల్లె మండలం కొత్తపల్లె గ్రామం, నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామం, ప్యాపిలి మండలం ఎస్.రంగాపురం గ్రామాల్లోని ఉప సర్పంచ్‌ల ఎంపిక కార్యక్రమం సంబంధిత ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. కొత్తపల్లెలో నిర్వహించిన ఉప సర్పంచ్ ఎంపిక కార్యక్రమానికి వార్డు మెంబర్లు గైర్హాజరు కావడంతో అధికారులు మంగళవారానికి వాయిదా వేశారు. జూపాడుబంగ్లా ఉప సర్పంచ్‌గా మోతే రాజ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు అధికారులు ప్రకటించారు. అలాగే.. అంకిరెడ్డి పల్లె ఉపసర్పంచ్‌గా దూదేకుల నల్లన్నగారి పెద్ద దస్తగిరి, నాగటూరు ఉప సర్పంచ్‌గా సగినేల ఉశేనయ్య, ఎస్. రంగాపురం ఉపసర్పంచ్‌గా లంకాయపల్లె లక్ష్మీదేవిని ఎంపిక చేశారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడి హత్య

- కుటుంబ కలహాలే కారణం?



హత్యకుగురైన నర్సోజీ (ఫైల్)

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరి మెట్ట- పెద్దకొట్టాల రహదారిలో నర్సోజీ (40) అనే ప్రైవేటు ఉపాధ్యాయుడిని సోమవారం ఇద్దరు దుండగులు గొడ్డళ్లతో నరికి దారుణంగా హత్య చేశారు. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన నర్సోజీ కి 7 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నర్సోజీ అయ్యలూరి మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు హెల్మెట్ ధరించి నర్సోజీపై గొడ్డలితో దాడి చేశారు. బైక్‌పై నుంచి కిందపడిన అతను ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగుతీసినా దుండగులు వెంటపడి గొడ్డలితో తలపై నరికి హత్య చేశారు. ఈ ఘటనలో నర్సోజీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి రామాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సోజీ కుటుంబంలో తలెత్తిన కలహాలే హత్యకు కారణమనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా షాకీర్ హుసేన్

కర్నూలు(టౌన్) : నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌చార్జ్ ఈఈగా పనిచేస్తున్న షాకీర్ హుసేన్‌కు రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం రాత్రి 585 జీవో ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే నంద్యాల మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించి ఆదోని మున్సిపాలిటీకి బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టిన పదోన్నతుల్లో ఉమ్మడి జిల్లా నుంచి వీరిరువురికీ అవకాశం లభించింది.

- భావి భారత నిర్మాతలు ఉపాధ్యాయులు
- తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లాలో 47 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

గురుభ్యోనమః

నంద్యాల(న్యూటౌన్): మనిషిలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞాన దీప్తిని వెలిగించేవాడు గురువు. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది. తల్లిదండ్రుల తరవాత స్థానం వారిదే. రేపటి సమాజాన్ని వీరు తేజోమయం చేస్తున్నారు. నైరూప్య చిత్రాల్లా ఉండే పాఠ్యంశాలను క్రమంగా సుందర చిత్రల్లా దర్శించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతారు. సమాజంలో వీరి స్థానం గొప్పది. ఎంతగా అంటే.. 'దేవుడు, గురువు పక్కనే ఉంటేం నేను మొదట గురువుకే నమస్కరిస్తా' అని కబీర్‌దాస్ అన్నంతగా.. అందుకే ఏటా సెప్టెంబర్ 5న భారతరత్న, భారతదేశ తొలి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున ఉపాధ్యాయదినోత్సవం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసే ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ప్రోత్సహించేలా ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయి ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులతో సత్కరించనుంది. ఈ మేరకు 2023-24 సంవత్సరానికి గాను జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డి, గడివేముల మండలం గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ దస్తగిరిమ్మ, గడివేముల మండలం కరిమద్దెల ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న నిర్మల జ్యోతి సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అలాగే బండిఆత్మకూరు జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకుడు రఘునాథ్‌రెడ్డి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరంతా మంగళవారం వైజాగ్‌లో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు. అలాగే జిల్లాకు చెందిన 47 మంది



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 9 మంది, ప్రిన్సిపాల్ ఏపీఎంఎల్ ఒకరు, ప్రిన్సిపాల్ కేజీబీవీ ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్లు 18, పీజీటీ ఒకరు, స్కూల్ అసిస్టెంట్ పీడీ ఒకరు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 11 ఉన్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. అలాగే జూనియర్ కళాశాల అధ్యాపకులు నలుగురు, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా రఘునాథ్‌రెడ్డి

బండిఆత్మకూరు ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు రఘునాథరెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. 2013లో జిల్లా ఉత్తమ అధ్యాపక అవార్డు కూడా పొందారన్నారు.



రఘునాథరెడ్డి

2021 నుంచి 2022 వరకు ఎమ్మిగనూరు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసి ప్రస్తుతం బండిఆత్మకూరు జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఏటా ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక కావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని రఘునాథ్‌రెడ్డి తెలిపారు. విశాఖపట్టణంలో మంగళవారం జరిగే గురుపూజ దినోత్సవ కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకోనున్నట్లు కళాశాల డీవీఎం సునిత సోమవారం తెలిపారు.

చిత్రం.. అపురూపం



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, చిత్రకారుడు మధుకృష్ణ సోమవారం కోడిగుడ్డుపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి వంటి పదవులకు వన్నె తెచ్చిన రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయమన్నారు. – ప్యాపిలి

పేరు	పనిచేసే ప్రాంతం
హెచ్‌ఎంలు..	
వెంకటేశ్వర్లు	జెడ్పీహెచ్‌ఎస్, ఓబుళంపల్లి
అనితజీవన్	జెడ్పీహెచ్‌ఎస్, దామగట్ల
అయూబ్ అహమ్మద్	జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు
సోమశేఖర్‌రెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, కొత్తపేట
పద్మావతి	జెడ్పీహెచ్‌ఎస్, యాగంటిపల్లి
వాజిదున్నాసాజీ	జెడ్పీహెచ్‌ఎస్, సీతారాంపురం
సురేష్‌బాబు	జెడ్పీహెచ్‌ఎస్, ఎన్ఎన్ కాలనీ
నాగేశ్వరరెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, అల్వకొండ
రామలింగారెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, వేల్పనూరు
స్కూల్ అసిస్టెంట్లు.....	
నాగరాజు	జెడ్పీహెచ్‌ఎస్, ఆళ్లగడ్డ
దుర్గాబాయి	జీహెచ్‌ఎస్, ఆత్మకూరు
మధుసూదనరావు	జెడ్పీహెచ్‌ఎస్, నందవరం
రాజశేఖర్‌రెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, హనుమాన్‌నగర్
వెంకటరాముడు	జెడ్పీహెచ్‌ఎస్, చాగలమర్రి
కృష్ణయ్య	జెడ్పీహెచ్‌ఎస్, దుద్యాల
శివనారాయణరెడ్డి	జెడ్పీహెచ్‌ఎస్, కనకాద్రిపల్లె
లీలావతమ్మ	జెడ్పీహెచ్‌ఎస్, ఎం.తిమ్మాపురం
మధుసూదనరాజు	జెడ్పీహెచ్‌ఎస్, పోలూరు
మేరి పుష్ప	ఎస్టీ జోసెఫ్ హైస్కూల్, పెద్దకొట్టాల
పద్మావతి	ఎంపీఎల్ హైస్కూల్, నూనెపల్లె
ప్రసాద్	ఎంపీఎల్ హైస్కూల్ టెక్కె
షఫక్‌తుల్లా	కేఎస్‌ఎం మున్సిపల్ స్కూల్ నంద్యాల
రవికాంత్‌బాబు	జెడ్పీహెచ్‌ఎస్, సింగవరం
జిలానీబాషా	జీహెచ్‌ఎస్, పాణ్యం
శ్రీనివాసులు	జెడ్పీహెచ్‌ఎస్, రాంపల్లి
బాలగురప్ప	జెడ్పీహెచ్‌ఎస్, యర్రగుంట్ల
సుబ్రమణ్యం	జెడ్పీహెచ్‌ఎస్, వెలుగోడు
శ్రీలక్ష్మి	ఏపీటీడబ్ల్యూఆర్‌ఐ స్కూల్, బలపనూరు
ఎస్‌జీటీ...	
వెంకటేశ్వర్లు	ఎంపీపీఎస్, కొట్టాల చెరువు
అశోక్‌రెడ్డి	ఎంపీపీఎస్, కడమలకాల్వ
కృష్ణవేణమ్మ	ఎంపీపీఎస్, సంజీవనగర్
రాజేశ్వరమ్మ	ఎంపీపీఎస్, డబ్ల్యూ.గోవిందిన్నె
రవి	ఎంపీపీఎస్, బూజనూరు
రామలక్ష్మమ్మ	ఎంపీపీఎస్, తిమ్మాపురం
రమాదేవి	ఎంపీపీఎస్, రైతునగర్
పోతులూరు	ఎంపీపీఎస్, హోలీక్రాస్ స్కూల్, నంద్యాల
ఎలిశమ్మ	ఎంపీపీఎస్, ప్రాతకోట
అస్మాబేగం	ఎంపీపీఎస్, పోతిదొడ్డి
వెంకట రామకృష్ణారెడ్డి	ఎంపీపీఎస్, యల్లావత్తుల
శ్రీకళ	జెడ్పీహెచ్‌ఎస్, తలముడిపి
సంజీవరెడ్డి	ఏపీ మోడల్ స్కూల్, శిరివెళ్ల
మాధవి	ఎంపీపీఎస్, శాంతినగరం
ప్రవీన	ఏపీఎంఎస్, పాణ్యం
రమణ	ఏపీ మోడల్ స్కూల్, అవుకు

కొండలరాయుడికి తేళ్లే నైవేద్యం!

- కోడుమూరులో కొనసాగిన వింత ఆచారం



కొండలరాయుడికి తేళ్లను నైవేద్యంగా సమర్పించిన దృశ్యం



పట్టుకున్న తేళ్లను చూపుతున్న దృశ్యం



తేళ్లను పట్టుకుంటున్న భక్తులు

కోడుమూరు రూరల్: ఎక్కడైనా దేవుళ్లకు భక్తులు పాలు, పండ్లు, ఫలహారాలను నైవేద్యంగా పెట్టి తమ మనస్సులోని కోరికలను కోరుకుంటారు. అయితే కోడుమూరులోని కొండమీద వెలసిన కొండలరాయుడికి మాత్రం భక్తులు తేళ్లను చేతులతో పట్టుకొని స్వామివారిపై వదిలి తమ మొక్కులను తీర్చుకుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే మూడో సోమవారం ఈ వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. తేలును పట్టుకునే సమయంలో కుట్టినా స్వామి వారి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోతుందన్నది ఇక్కడి భక్తుల నమ్మకం. సోమవారం సాయంత్రం వందలాది మంది ప్రజలు కాలినడకన కొండపైకి చేరుకొని కొండలరాయుడిపై తేళ్లను వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్నకు చెబుదాం, స్పందన వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టరు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం -స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించక పోతే మళ్లీ రీఓపెన్ అయ్యే అవకాశముందన్నారు. జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో ప్రజలు అసంతృప్తి చెందిన కేసులు, రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిశీలించాలన్నారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 142 దరఖాస్తులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

స్పందనలో కొన్ని వినతులు...

- పాండురంగాపురం గ్రామంలో సర్వే నంబర్ 349/1లో 8.50, 349/2లో 3.88 ఎకరాల భూమిని 1972లో నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఈ చెందిన 32 మందికి 3.88 ఎకరాలు భూమిని డీ పట్టాగా ఇచ్చారని,



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నా పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక పోవడంతో ఆన్‌లైన్‌లో పేరులో నమోదు కాలేదని, అధికారులు న్యాయం చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

- నంద్యాల తహసీల్దార్ కార్యాలయంలో జూలై నెలలో లీగల్ హైర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే ఇంత వరకు రాలేదని వెంటనే ఇప్పించాలని కోరుతూ నంద్యాల పట్టణం నూనెపల్లెకు చెందిన బి.శశికళ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు మృతి చెందాడని, భార్య కూడా ఆరోగ్యం సరిగా లేదని, కూలీ పనులు చేసుకుంటున్న తనకు ఇంకా ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ పోషణ నిమిత్తం ప్రభుత్వం తరపున ఆర్థిక సమాయం అందజేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కర్నూలులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

కర్నూలు (టౌన్): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 352 వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనేందుకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి కర్నూలుకు వచ్చారు. స్థానిక బి.క్యాంపులోని అతిథి గృహం వద్ద జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్‌కుమార్, జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్ పటేలు బొకే అందజేసి స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్‌ఓ నాగేశ్వరరావు, ఆర్డీఓ హరిప్రసాద్ ఉన్నారు. అనంతరం ఆయన కర్నూలు నుంచి మంత్రాలయానికి బయలుదేరి వెళ్లారు.



జవహర్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య

క్షేత్రాలను సందర్శించిన హైకోర్టు జడ్జి



మల్లన్న సన్నిధిలో న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు దంపతులు

శ్రీశైలం టెంపుల్/ఆళ్లగడ్డ/మహానంది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులు సోమవారం జిల్లాలోని శ్రీశైలం, అహోబిలం, మహానంది క్షేత్రాలను సందర్శించారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం శ్రీశైలం చేరుకున్న వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు. అలాగే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో లక్ష్మీ నరసింహా స్వామి వార్లను, మహానంది క్షేత్రంలో కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. న్యాయమూర్తి వెంట కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

తులాభారం త్రాసు విరాళం



తులాభారం త్రాసుకు పూజలు చేస్తున్న దాతలు, ఆలయ అధికారులు

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు అవసరమైన తులాభారం త్రాసును ఓ భక్తుడు విరాళంగా అందజేశారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం చింతకుంట్లకు చెందిన ఇంజేటి నాగిరెడ్డి, సిరిచందన దంపతులు రూ. 1.50 లక్షలతో తయారు చేయించి సోమవారం పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు ముందుగా శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు చేశారు.

ఉద్యోగాలు రాకుండా అన్యాయం చేశారు



మాట్లాడుతున్న ముబీనా, షహనాపర్వీన్

కర్నూలు(హాస్పిటల్): తమకు రావాల్సిన ఉద్యోగాలను అర్హతలేని వారికిచ్చి అన్యాయం చేశారని పలువురు ఫార్మాసిస్టులు ఆరోపించారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఫార్మసి అభ్యర్థినులు ముబీనా, షహనా మాట్లాడుతూ డీసీహెచ్‌ఎస్‌లో ఫార్మాసిస్టు పోస్టుల భర్తీలో భాగంగా తాము దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఫైనల్ మెరిట్‌లిస్ట్‌లో తమకు వరుసగా 26, 17 ర్యాంకులు వచ్చాయని, కానీ మాకంటే అధిక ర్యాంకు ఉన్న వారికి పోస్టులు కట్టబెట్టారని విమర్శించారు. ఇదేమని డీఎంహెచ్‌ఓను అడిగితే డీసీహెచ్‌ఎస్‌ను అడగాలని చెప్పారని, డీసీహెచ్‌ఎస్‌ను అడిగితే పోస్టుల భర్తీ, మెరిట్‌లిస్ట్ విడుదల చేసింది వైద్య ఆరోగ్యశాఖ అని అక్కడే అడగాలని వారు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత క్లర్క్‌ను అడిగితే ఆ సమయంలో మీరు హాజరుకాలేదని, అందుకే ఇతరులకు ఇవ్వాల్సి వచ్చిందని చెబుతున్నారన్నారు. తమకు ఎవ్వరూ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఫోన్ చేయలేదని, వివరాలు ఆన్‌లైన్‌లో కూడా పెట్టకుండా పోస్టులు భర్తీ చేశారని వారు ఆరోపించారు. అనంతరం ఈ విషయమై వారు స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పాల ఉత్పత్తి.. జాగ్రత్తలతో సంపత్తి

- పాలలో వెన్న, ఎస్ఎన్ఎఫ్ తగిన స్థాయిలో ఉండాలి
- వెన్న శాతాన్ని తెలుసుకునేందుకు మిల్కోటెస్టర్ వినియోగించాలి
- ఈనిన పశువు పాలను 15 రోజుల వరకు పాల కేంద్రానికి పోయరాదు
- పాడి రైతులకు పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సూచనలు



పాలు పితుకుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): పాడి పరిశ్రమపై యువత, ఇతర రైతులకు ఆసక్తి పెరుగుతోంది. పాడి లాభసాటిగా ఉండాలంటే పాల ఉత్పత్తిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. భారీ విలువ కల్గిన పాడి పశువులను కొని పాల ఉత్పత్తి, నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టాలు వచ్చే అవకాశం ఉంది. పరిశుభ్రమైన పాల ఉత్పత్తికి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సూచనలు పాటించాల్సి ఉందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. పరిశుభ్రమైన పాల ఉత్పత్తికి ఆయన రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

- ➡ పాలు పితికే ముందు పశువుల పాకలను శుభ్రం చేసి నీళ్లు చల్లాలి. పాడి పశువు శరీరం, ముఖ్యంగా కడుపు, డొక్కలు కడగాలి, పొదుగును శుభ్రంగా కడిగి తెల్లని గుడ్డతో తుడవాలి. లేకపోతే మలిన పదార్థాలు పాలలో పడి కలుషితమయ్యే ప్రమాదం ఉంది.
- ➡ పాలు పితకడానికి అరగంట ముందు పాడి పశువుకు నీరు, కుడితి, దాణా పెట్టాలి. ముందు పితికే పాలన ఒక పాత్రలోకి ఉంచాలి. వీటిలో సూక్ష్మ జీవులు ఎక్కువగా ఉంటాయి. వెన్న శాతం తక్కువగా ఉంటుంది.
- ➡ పితకడానికి ముందుగానే దూడను పాలు తాగనివ్వాలి. ఆఖరి పాలు తాగనివ్వకూడదు. పాలలో ఉప్పు, సోడా, చక్కెర కలుపరాదు.
- ➡ పాలు పితికే మనిషి చేతులకు కురుపులు, పుండ్లు ఉండకూడదు. చేతివేళ్ల గోళ్లను కత్తిరించుకోవాలి. తడి చేతులతో పాలు పితకడం వల్ల పొదుగుకు పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది.
- ➡ పాలు పితికే ముందు మొదటి 2 చారలు నల్లని గుడ్డ మీద పితకాలి. అందులో కుదపలు కాని, రక్తపు జీరలు ఉంటే పొదుగు వ్యాధిగా గుర్తించాలి. ఈ పశువు పాలను మిగతా పాలలో కలపరాదు.
- ➡ పొదుగు చనుకట్లను పిడికిలి నిండుగా పట్టుకొని పితకాలి. కొందరు బొటనవేలితో చన్నులను నొక్కి పాలు తీస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. దీనివల్ల చనుకట్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. పాలు సాధ్యమైనంత తొందరగా పితకాలి. అంటే 7-8 నిమిషాల్లో పితకడం పూర్తి చేయాలి. పితికేటప్పుడు కుక్కలు, పిల్లి అరుపుల వల్ల, ఇతరత్రా పశువుల వల్ల బెదరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ➡ పాలు కలుషితం కావడం వల్లే రంగు మారుతుంది. అసాధారణమైన రంగును గమనిస్తే వాటిని తిరస్కరిస్తారు. పాలు మామూలు రుచి కల్గి ఉన్నట్లయితే అలాంటి వాటిని సేకరించవచ్చు. పుల్లగాను, చేదుగాను ఉంటే వాటిని వాడకూడదు.
- ➡ పాలలో వెన్న శాతాన్ని తెలుసుకోవడానికి మిల్కోటెస్టర్ అనే పరికరాన్ని వినియోగించవచ్చు. ఎస్ఎన్ఎఫ్ అనగా పాలలో వెన్న పోగా మిగిలిన ఘన పదార్థాలు పరీక్షించడానికి లాక్టోమీటర్ వాడతారు. పాల నాణ్యతను ధరను నిర్ణయించడానికి వెన్న శాతంతో పాటు ఎస్ఎన్ఎఫ్ కూడా పరిగణలోకి తీసుకుంటారు.
- ➡ పాడి పశువు వయస్సు పెరిగేకొద్దీ వెన్న శాతం, ఎస్ఎన్ఎఫ్‌లలో తగ్గుదల వస్తుంది. పశువును బెదిరించినప్పుడు, భయాందోళనతో ఉన్నప్పుడు, అనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు పాలలో వెన్న శాతం తగ్గుతుంది.

- ➡ పాలు పితికిన తర్వాత తెల్లటి గుడ్డతో వడపోయాలి. దుమ్ము, ధూళి, పేడ, గడ్డి పరకలు, ఈగలు పడకుండా చూడాలి. పడితే వెంటనే తీసివేయాలి. ఈనిన పశువుల పాలను 15 రోజుల వరకు పాల కేంద్రానికి పోయరాదు.
- ➡ పాలు ఆహారంలో అతి ముఖ్యమైన అంశం. నాణ్యత విషయంలో ప్రజారోగ్య శాఖ కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను ప్రజారోగ్య చట్టంలో పొందుపరిచింది. దీని ప్రకారం గేదె పాలలో కనీసం 5 శాతం వెన్న, 9 శాతం ఎస్ఎన్ఎఫ్ ఉండాలి. ఆవు పాలలో 3.5 శాతం వెన్న, 8.5 శాతం ఎస్ఎన్ఎఫ్ ఉండాలి. ఇంతకన్నా తక్కువగా ఉంటే అవి నాణ్యత లేని పాలుగా నిర్ణయించి జరిమానా విధిస్తారు.